

విడి ప్రతి రూ.10/-

మే 2011

# స్పందన

ఆధ్యాత్మిక మాసపత్రిక

మీ తలవెంట్రుకలన్నియు లెక్కింపబడియున్నవి
గనుక మీరు భయపడకుడి,
మీరనేకమైన పిచ్చుకలకంటె శ్రేష్ఠులు

మత్తయి 10:30,31

# బ్రదర్ ఏసన్న గారితో సింగపూర్ సందర్శన



దైవజనులు ఏసన్న గారి ప్రసంగము



పాస్టర్ జీవ, బ్రదర్ ఏసన్న, బ్రదర్ దేవ



పరిశుద్ధ ప్రభువు బల్ల



సింగపూర్‌ను దర్శించిన పాస్టర్లు



హోసన్నా సేవకురాండ్రు, పాస్టర్ జీవ దంపతులు



చైనీస్ హోటల్‌లో విందు



సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉన్న చేప నోరు.
యోనాను చేప మింగింది అంటే అశ్చర్యమా



నైట్ సఫారీలో మేము చూచిన మరో వింత. నోట్లో కిరోసిన్ పోసుకొని అది బయటకు చిమ్ముతుంటే ఈ మంట వస్తుంది.



సాంగ్ ఆఫ్ సీ అని,
వెలుగు రేఖ మీద మరో అద్భుతం



చూడడానికి కమల పుష్పంలా
ఉన్న భవనము




మేము ప్రయాణించిన ఈ డక్ టూర్స్ అనే ఈ బండి బాతులాగ నేలమీద నడుస్తాది, నీళ్ళలో ఈదుతుంది.



మహా జెయింట్ వీల్. భయపడి ఎక్కలేదు గానీ, ఎక్కితే ప్రక్క దేశం మలేషియా కూడా కనిపిస్తుందట

# దైవజనులు ఏసన్న గారితో సింగపూర్ సందర్శన

ఏప్రిల్ నెల మూడో వారంలో దైవజనులు ఏసన్న గారితో సింగపూర్ దర్శించటానికి ప్రభువు కృప చూపారు. **"మీరు ఏకాంతముగా అరణ్య ప్రదేశమునకు వచ్చి కొంచెము సేపు అలసట తీర్చుకొనుడని"** శిష్యులతో ప్రభువు అన్నమాటలివి. ఇంగ్లీషు బైబిలులో 'రెస్ట్' అని, 'రిఫ్రెష్' అనే మాటలు ఉపయోగించబడ్డాయి. అంటే 'విశ్రాంతి', 'సేదతీరుట' అనే అర్థాలు కూడా ఉన్నాయి. ఎల్లప్పుడూ సేవ చేసే వారికి కొంత విశ్రాంతి కూడా చాలా అవసరమని దైవజనులనేకులు గట్టిగా సలహా ఇస్తున్నారు. ఈ సింగపూర్ ప్రయాణం అలాంటిదే! దైవజనులు ఏసన్న గారు సింగపూర్ దేశాన్ని ఎంతగానో ప్రేమిస్తారు.

హోసన్నా మినిస్ట్రీస్‌లోని సేవకులు, సేవకురాండ్రు కొందరు, గుంటూరు పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులతోపాటు నన్ను కూడా అన్న తీసుకుని వెళ్లారు. అన్నతో కొంత వ్యక్తిగతంగా సమయం గడపటానికి కూడా అవకాశం దొరికింది. దైవజనుని జీవితం, సేవా వివరాలు మన స్పందనలో ప్రచురిద్దాము అనుకుంటున్నాము కాబట్టి ఈ సమయం ఎంతో ఉపయోగమయింది.

సింగపూర్ సముద్రంలో ఉన్న చిన్న ద్వీపం. ఓ గంట కారులో ప్రయాణం చేస్తే ఆ దేశం ఆ చివరి నుండి ఈ చివరి వరకూ ప్రయాణం చేయొచ్చు, అంటే ఎంత చిన్న దేశమో మీరు అర్థం చేసుకోవచ్చు, కాని సంపన్న దేశం! అందుకే అంత ప్రాముఖ్యత సంతరించుకున్నది. సింగపూర్‌కు 'ఫైన్' కంట్రీ, అని ఓ పేరుందట! అంటే ఈ దేశం చాలా 'ఫైన్' మంచిది, చక్కని దేశమనే అర్థమే కాకుండా, ఏదైనా పొరపాటు చేస్తే 'ఫైన్' జరిమానా కూడా ఎక్కువగానే ఉంటుంది. పొరపాటున మీరు పేపరు రోడ్డు మీద వేశారనుకోండి, మన దేశంలోలాగా రోడ్డు మీద ఉమ్మివేశారనుకోండి, 300 డాలర్లు అంటే మన డబ్బు సుమారుగా రు. 10,500. అయ్య బాబోయ్ అంత డబ్బా! అవును అందుకే ఆ దేశం అంత చక్కగా నీట్‌గా చూడముచ్చటగా ఉంటుంది.

సరే, ఈ చిన్న దేశం ఇంతగా ఆశీర్వదించబడటానికి కారణమేంటి? అని అక్కడున్న పాస్టర్లను అడిగాను. 35 శాతం మారుమనస్సు అనుభవం గలిగిన విశ్వాసులు ఈ దేశంలో ఉన్నారట! మరో కారణమేమంటే, సింగపూర్ క్రైస్తవ సంఘం దేవుని సేవకు ప్రపంచ వ్యాప్తంగా దారాళంగా కానుకలు పంపిస్తుందట, ఈ మధ్యనే ప్రచురించిన ఓ నివేదికలో అమెరికా కంటే సింగపూర్ దేవుని సేవకు ఎక్కువ ఖర్చు చేస్తోందని తెలిపారట. అవును, ఓ చిన్న ద్వీపమైన ఈ దేశాన్ని ప్రపంచ దేశాల సరసన చెప్పుకుంటున్నారంటే అది దేవుని దీవెనే!

దేవుని సేవకులమైన మా మీద ఏసన్న గారు చూపిన ప్రేమ అంతా ఇంతా కాదు. ఓ సారి నేను వారి రూంలో కూచుని మాట్లాడుతున్నాను. ఈ టీమ్‌కు ఏ రోజు ఏ హోటల్లో భోజనం చేయించాలో ముందుగానే ప్లాన్డ్‌గా ఓ లిస్టు రాసి ఉంచుకున్నారు. సింగపూర్‌లోని బెస్ట్ హోటల్స్‌లో సేవకులందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. సింగపూర్‌లోని శ్రేష్ఠమైన విషయాలను ఈ టీంకు చూపించారు. హోసన్నా పరిచర్యల సేవకులు, సేవకురాళ్లయెడల అన్న చూపించిన జాగ్రత్త, ప్రేమ ఓ తండ్రిలాంటి ప్రేమ! క్రమశిక్షణ, చెప్పిన మాటకు విధేయత చూపటం అన్న కోరుకునే మంచి విషయాలు.

మట్టల ఆదివారం సేవను సింగపూర్‌లో కలిగియుండటం ఓ కొత్త అనుభవంగా ఉంది. సింగపూర్‌లోని సేవకులు ఏసన్న గారిని ఎంతగానో అభిమానిస్తారు, ప్రేమిస్తారు. అన్న ప్రార్థించి, ప్రతిష్ఠ చేసిన ఓ తమిళ సంఘంలోని ఈ ప్రత్యేక ఆరాధనలో పాల్గొన్నాము. అన్న తమిళంలో కూడా అనర్గళంగా మాట్లాడుతారు. ఆ సంఘం వారి అమితానందం మాటల్లో వర్ణించ లేము. నాకైతే తమిళం రాదు గాని అన్న సందేశం వింటూ ఆనందిస్తోన్న వారందరితో నేను కూడా ప్రభులో ఆనందించాను. తమిళ భాషలో పాడిన అన్న పాటలన్నీ మాత్రం నాకు అర్థమయ్యాయి. దేవునికి స్తోత్రాలు. అన్నట్టు సింగపూరు దేశ అధికార భాషలలో తమిళ భాష ఒకటి.

ప్రయాణమంతటిలో దేవుడు మాకిచ్చిన క్షేమం కోసం దేవునికి వందనాలు సమర్పిస్తున్నాము. హల్లెలూయా!

1976 - 2011 35 సంవత్సరాలుగా దేవుని అపార కృపలో

# స్పందన
ఆధ్యాత్మిక మాసపత్రిక

*The largest circulated Telugu Christian monthly since 35 years*

మే 2011 సంపుటి 35 సంచిక 5

వ్యవస్థాపకులు
**ఆచార్య ఆరార్కె మూర్తి**
ప్రచురణకర్త, సంపాదకులు
**డా॥ దేవసహాయం దండల**
గౌరవ సలహాదారులు
**ప్రొఫెసర్ గుజ్జర్లమూడి కృపాచారి**
సహకారం
**పాస్టర్ పి. సురేశ్ బాబు**
సంపాదక వర్గం
**బ్రదర్ కె. పరమానందం, బ్రదర్ ఎన్. దేవానంద్, బ్రదర్ ఆర్. ఎలూజై, రెవ. కె. జాన్ మోజెస్, శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్**
సహాయ సంపాదకులు
**బ్రదర్ డి. ఎఫ్రాయిం, బ్రదర్ డేవిడ్**

మా అడ్రస్
**స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక**
51-4-12, ఇ.ఎస్.ఐ హాస్పటల్ రోడ్,
గుణదల, విజయవాడ - 520 004,
ఫోన్ : 0866- 2456547,
మొబైల్: 9490 11 3300/ 994 833 5222
*E-mail: spandana1976@gmail.com*

## స్పందన ఆఫీసుకు రావాలంటే...

విజయవాడలో, గుణదల సెంటర్ నుండి ఇ.యస్.ఐ హాస్పటల్ రోడ్‌లో ఉన్న పాత పంచాయితి ఆఫీసు సెంటర్‌కు రావాలి. ఇయస్ఐ హాస్పటల్ రోడ్డులో ఉన్న దేవాలయం, ప్రక్కనే ప్రగతి నివాస్ అపార్ట్‌మెంట్స్ ఉంటుంది. మొదటి అంతస్థులో రెండో అపార్ట్‌మెంట్

**ఆఫీసు సమయం ఉ॥ 10 నుండి సా॥ 5 గం.**

## ఈ సంచికలో..

| | |
|---|---|
| పరలోక ప్రవేశం | 6 |
| ఉజ్జీవం | 8 |
| అద్భుతమైన ఫలితాలు | 10 |
| యేసు నేర్చుకొనెను | 12 |
| నన్ను రక్షించిన దేవుడు | 14 |
| ప్రేమ | 16 |
| ప్రకటన గ్రంథం | 18 |
| మదర్ థెరిసా | 26 |

### చందా వివరాలు

| | స్వదేశంలో | విదేశాల్లో |
|---|---|---|
| 1 సంవత్సరం | ₹ 150 | $ 20 |
| జీవిత సభ్యత్వం | ₹ 2000 | $ 200 |
| పోషక సభ్యత్వం | ₹ 150 (ప్రతినెల) | $ 20 |

**ప్రత్యేక మనవి**

అందరికీ చందా అందుబాటులో ఉండాలని రు. 150 గా ఉంచాము. వాస్తవానికి సుమారు రు. 200 పైగా ఖర్చవుతుంది గనుక రు. 200 పంపగలిగిన వారు, కానుకలు పంపగలిగిన వారు ఈ సేవకోసం ప్రార్థించి, ప్రభువు మిమ్మును ప్రేరేపించినట్లు సహకరించాలని మనవి. ఇప్పటికే ఈ సేవలో ఆర్థికంగా సాయపడుతున్నవారికి మా ప్రత్యేక వందనాలు. మీరు పంపే చెక్కులు, డ్రాఫ్టులు, యం. ఓలు స్పందన (SPANDANA) పేరు మీద పంపాలని మనవి. వెంటనే మీకు స్పందన ఆఫీసునుండి ఉత్తరం పంపిస్తాము. దేవుడు మిమ్మును దీవించును గాక!

అకౌంట్ పేరు "స్పందన" (SPANDANA)

ఆంధ్రాబ్యాంక్, గుణదల (బ్రాంచ్), విజయవాడ
ఆన్‌లైన్ అకౌంట్ నం. 015810100016691
ISFS Code - ANDB0000158

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,రామవరప్పాడు (బ్రాంచి), విజయవాడ
ఆన్‌లైన్ అకౌంట్ నం. 31541230212
IFSC Code - SBIN0011100

Printed, Published and owned by DEVASAHAYAM DANDALA Printed at Spandana Offset Printers, Suryaraopet, VJA-2. Ph:2430148, For Spandana Graphics & Published from # 30-3-13, Durga Agraharam, Vijayawada - 2.

## ఆణిముత్యాలు

**యో**హాను 4:24 యేసు ప్రభువు సమరయ స్త్రీతో అన్నాడు. దేవుడుఆత్మ గనుక ఆయనను ఆరాధించేవారు ఆత్మతో, సత్యంతో ఆరాధించాలి. దేవుణ్ని ఆరాధించాలంటే పరిశుద్ధాత్మ నడుపుదల కావాలి. ఆరాధన శక్తిభరితమైనది. దేవునికి అలాంటి ఆరాధికులు కావాలి. పరలోకము వాస్తవమని మన నిరీక్షణ పరలోకమందు కేంద్రీకరించబడి ఉన్నదని ఆరాధనలో వ్యక్తమవుతుంది. దేవుని మహిమ మనకు ఆరాధనలోనే అనుభవానికి వస్తుంది. దేవుడు మన స్తుతికి పాత్రుడు. అరాధించడం ద్వారా మనము దేవుణ్ని మహిమ పరుస్తాము. ఆరాధనలో స్తుతి ఎంతో ప్రముఖ పాత్ర వహిస్తుంది. దేవుడు ఏమై ఉన్నాడో అది మనము చెప్పగలిగితే ఆరాధన అర్ధవంతమవుతుంది. దేవుని యొక్క సింహాసనం స్తుతులతోనే మనము సమీపించగలం. దేవుని పాదపీఠమే ఈ భూమి. ఆయన పాదాల వద్ద ప్రణమిల్లి ఆయనను స్తుతిస్తాము. ఆయనను మహిమ పరుస్తాము. దేవుడు తన మహిమను మనకు బయలుపరుస్తాడు. ఆరాధనలోని స్తుతి మహిమను ఉత్పత్తి చేస్తుంది. మనము మహిమ నుండి మహిమకు క్రమేణా హెచ్చించబడాలంటే స్తుతి ఆరాధన నిత్యవసరం. పరిశుద్ధాత్మ మనలను క్రీస్తు రూపానికి మారుస్తున్న అనుభవం ఆరాధనలోనే మనకు కలుగుతుంది. మతం, పాత సరుకు అది పాతగిల్లిపోయిన తిత్తి అందులో క్రొత్త ద్రాక్షరసం పోయకూడదని స్వయంగా చెప్పాడు. ఆరాధన ప్రతిసారి ఒక క్రొత్తదనాన్ని మనలో ప్రకల్పన చేస్తుంది. ఆరాధన విశ్వాసికి ఎప్పటికప్పుడే తాజా అనుభవం. మహిమ ప్రతిసారి అధికమై నవనూతనమై మన నిరీక్షణను వృద్ధి చేస్తుంది. మనము కృప పొందినవారము అయితే ఆరాధనలో మహిమలోకి అడుగుపెడతాము. మహిమ వాతావరణంలో ప్రవేశిస్తాము. రాను రాను యేసు మహిమ మనలను లోతైన అనుభవంల్లోకి తీసుకువెళ్తుంది. కొత్తదనం లేనిది మతాచార కాండ. అందులో మహిమ ఉండదు. అది మతభారం కానీ ఆరాధనలో మనము మహిమ భారాన్ని అనుభవిస్తాము. ఆరాధనలో మనం విన్న వాక్యం ఫలిస్తుంది. ఆ ప్రకారం చేయడానికి శక్తి వస్తుంది. మూసలో పోసినట్టు మిలటరీ డ్రిల్ లాగా ఆరాధన ఉండకూడదు. ఎందరు కలిసి ఆరాధన చేస్తారో వారందరిలో ఆత్మ శక్తి ఒక పెద్ద మొత్తంగా బహిర్గతమవుతుంది. 2 కొరింథీ 3:18 మనమందరం ముసుకు లేని ముఖంతో ప్రభువు యొక్క మహిమను పొందుతూ ప్రభువైన ఆత్మ చేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము. ఇది ఆరాధన అనుభూతి. 2 కొరింథీ 4:5,6. దేవుడు తన మహిమను గూర్చిన జ్ఞానాన్ని యేసు క్రీస్తునందు వెల్లడిపరుస్తున్నాడు. మన హృదయాలలో ఆయన ప్రకాశిస్తున్నాడు. అంధకారంలోనుండి వెలుగు ప్రకాశిస్తుందని దేవుడే చెప్పాడు. మన ఆరాధన వర్ధిల్లును గాక. దేవునికి స్తోత్రం ఆమేన్. దైవాశీస్సులు.

క్రీస్తునందు భవదీయుడు - ఆరార్కే

# మనలో మాట....

క్రీస్తునందు ప్రియ పాఠకులకు,

ప్రభువు దివ్య నామమున మీకందరికీ "నేను బ్రతుకు దినములన్నియు కృపాక్షేమములే నా వెంట వచ్చును" అనే ప్రశస్తమైన వాగ్దానాన్ని మరలా మరో సారి మీ దృష్టికి తెస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

మే నెలలో ఎండలు మండి పోతుంటాయి, అదే సమయంలో సువార్త సభలు ఎక్కువగా జరుగుతూ ఉంటాయి కూడా! ఆత్మ ఉజ్జీవం సమృద్ధిగా ప్రజ్వరిల్లాలని ప్రార్థన చేతాం!

23 కీర్తనను గురించిన కొన్ని శ్రేష్టమయిన తలంపులు మీ దృష్టికి తెస్తాను. మన దేవుడైన యెహోవాకు ఎన్నో పేర్లున్నాయి. మీరు జాగ్రత్తగా ధ్యానిస్తే, వివిధాలుగా 23 వ కీర్తనలో దేవుడు మనకు ప్రత్యక్షమవుతాడు. సంపూర్ణ సంఖ్య ఏడు. మన ప్రభువు ఏడు పేర్లు ఈ కీర్తనలో ధ్యానిద్దాము.

1) **'నాకు లేమి కలుగుదు'** అని భక్తుడు అంటున్నాడంటే **'యెహోవా యీరే'** – ప్రభువే చూచుకొనును. మన ప్రతి అవసరత తీర్చే ప్రభువును దర్శిస్తున్నాము.

2) రెండో వచనంలో **'శాంతి'** అనే మాటను మనం చూస్తున్నాము. **'యెహోవా – షాలేం'**, మన ప్రభువే సమాధానము. శాంతిని ప్రసాదించే దేవుడు.

3) **'నా ప్రాణమునకు ఆయన సేద తీర్చుచున్నాడు'** అంటే మరో మాటలో చెప్పాలంటే **'నాకు ఆయన ఆరోగ్యమిస్తున్నాడు'**. యెహోవా – రాఫా'. స్వస్థ పరచే దేవుడు. నిన్ను స్వస్థపరచు యెహోవాను నేనే అని సెలవిచ్చిన దేవుడు.

4) **'నీతి మార్గాలలో నన్ను నడిపిస్తున్నాడు'**. **యెహోవా –సిద్కెను**. మనకు నీతియైయున్న దేవుడు.

5) **'గాఢాంధకారలోయలో నేను నడిచినా నీవు నాకు తోడైయున్నావు'**. మనము ఒంటరిగా లేము, మన ప్రభువు మనతో ఉన్నాడు. **'యెహోవా – షమ్మా'**. ఎల్లప్పుడూ మనతో ఉండే ప్రభువు. ఇదిగో సదా కాలము మీతోకూడా ఉన్నాను.

6) **'భోజనపు బల్లను సిద్దపరుస్తున్నాడు'** అంటే ఆయన మనకు **'యెహోవా – నిస్సీ'**గా ఉన్నవాడు. మన దేవుడే మన ధ్వజము.

7) **'నా తలను నూనెతో అభిషేకిస్తున్నాడు'** మనకు గుర్తు వస్తుంది మన దేవుడు **'యెహోవా కాదేష్'**, మన కోసం తనను తాను సమర్పించుకున్న దేవుడు.

ఈ చిన్ని ధ్యానం మీ ఆత్మలకు ఆశీర్వాద కారణంగా ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థిస్తున్నాను. మే నెల స్పందన మాస పత్రిక మీ జీవితాలకు ఎంతైనా ఆశీర్వాద కారణంగా ఉండాలని ప్రార్థిస్తున్నాము. ప్రతి నెలా స్పందనను సిద్ధ పరుస్తూ, మీకు పంపిస్తూ మా ప్రార్థన ఇదే! దేవుని ప్రత్యేక ఆత్మ అభిషేకంతో మిమ్మును దర్శిస్తుంది. స్పందన ఆధ్యాత్మిక మాస పత్రిక అనేకమందికి ఆశీర్వాద కారణంగా ఉంటుందని ప్రతి నెలా ఎన్నో ఉత్తరాలు మాకు రాస్తున్నారు. దేవునికే మహిమ, ఘనత సమర్పిస్తున్నాము.

ఈ వేసవిలో చాలామందికి సెలవులుంటాయి. దేవుని సేవలో ఉండే మాకు మాత్రం పని మరెక్కువగా ఉంటుంది. మీ సంపాదకుడు సేవలో అనేక ప్రాంతాలు పర్యటించనున్నాడు. ప్రత్యేకమైన ఆత్మ అభిషేకం కోసం, వాక్య ప్రకటనకు అనేక ఆత్మలు రక్షింపబడేలా, విశ్వాసులు ఉజ్జీవింపబడేలా దేవుని అద్భుత ఆశ్చర్య కార్యాలు బలమైన విధానంలో జరిగేట్టు ప్రార్థించాలని మనవి చేస్తున్నాము. అనేక గ్రామాలలో ఉండే సేవకులు అనేకమంది వారి ప్రాంతాలు పర్యటించమని సభలలో వాక్యాన్నందించాలని కోరుతున్నారు. సమయాభావం వలన అనేక ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నాను.

ఈ పరిచర్యల ద్వారా ఎన్నో ఆత్మలు రక్షింపబడుతున్నాయి. ఎందరో ప్రజలు మేళ్లు పొందుతున్నారు. పేదలు, పిల్లలు, వృద్ధ విధవరాళ్లు సాయమందుకుంటున్నారు. ప్రార్థనలకు ప్రతిఫలంగా అనేకమంది దీవించబడుతున్నామని సాక్ష్యమిస్తున్నారు. హల్లెలూయా! మా ప్రియ పాఠకులు ఈ పరిచర్యకోసం ప్రార్థించండి, దేవుని మహిమార్థమై, ఆత్మల రక్షణకోసం పాటుపడుతున్న ఈ సేవకు మీ ప్రార్థనలు, ఆర్థిక సహకారం ఎంతైనా అవసరమని మనవి చేస్తున్నాను.

దేవుడు మిమ్మును దీవించి ఆశీర్వదించును గాక!

క్రీస్తునందు సేవలో మీ సోదరుడు

దేవ దండల.




## బైబిల్ వ్యాఖ్యానము

స్పందన ఎడిటర్ గారికి క్రీస్తు నామమున వందనములు. స్పందన ఆధ్యాత్మిక మాస పత్రిక మాకు ఎంతగానో ఆశీర్వాదకరముగా యున్నది. మాకు వాక్య సందేశములలో మీరు వ్రాస్తున్న బైబిల్ వ్యాఖ్యానములు సహకరిస్తున్నవి. ప్రకటన గ్రంథ పరమ సత్యాలు 2010 ఆగస్టులో ప్రారంభించారు. డిశెంబరుతో ముగించారు. చివరి వరకు పూర్తిగా అందించినట్లైతే ప్రకటన గ్రంథం బైండింగ్ చేసుకొనగలము. ప్రకటన గ్రంథ వ్యాఖ్యానము చాలా చక్కగా వ్రాసారు.

**పా॥రమేష్, బెంగళూరు.**

## బైబిల్ ధ్యానం

ప్రభువునందు ప్రియమైన స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక ఎడిటరు గారికి ప్రభువు నామమున శుభములు. పత్రిక మా జీవితాలకు ఎంతో ఆనందము శక్తి దేవుని వలన బలము కలుగజేయుచున్నవి. మీరు ప్రచురిస్తోన్న గ.ను.క, మెదడుకు మేత బైబిలు మరోసారి సారి చదువుటకు ఎంతో ఉపయోగపడుచున్నవి. అందును బట్టి మీకు నా ప్రత్యేక వందనములు.

**యన్.అంజయ్య, చినకాకాని.**

## ఆధ్యాత్మిక జ్ఞానము

గౌరవనీయులు క్రీస్తు నందు అత్యంత ప్రియులైన దేవ సహాయం గారికి మీరు టి.వీ కార్యక్రమం ద్వారా వినిపిస్తున్న వర్తమానాలు నేను వింటూ అనేక ఆధ్యాత్మిక విషయములను తెలిసికొనుచున్నాను.

**పి.మేరీ, తెనాలి.**

## ఉత్తేజ భరితమైనవి

బ్రదర్ గారికి ప్రభువు నామములో వందనములు. మీరు పంపిస్తున్న స్పందన పత్రిక మమ్మల్ని ఎంతో ఉత్తేజ భరితుల్ని చేస్తుంది. వర్తమానాలు ఎంతో ఆధ్యాత్మికంగాను ఉంటున్నాయి. దేవుడు మీకు ఇంత గొప్ప జ్ఞానము ఇచ్చినందులకు ఆయనకే మహిమ కలుగును గాక!

**టి.లత, రాజమండ్రి.**

## అర్ధగంట ముందే..

ప్రభువునందు ప్రియమైన సహోదరులు దేవసహాయం గారికి వందనములతో స్పందన టి.వి కార్యక్రమం ద్వారా ఆధ్యాత్మిక మేలు పొందుచున్నాము. లోతైన బైబిలు మర్మములు తెలుసుకుంటున్నాము. అర్ధగంట ముందే సిద్ధపడి టి.వి ముందు కూర్చుంటాను. చాలా అర్ధమయ్యేలా నిదానంగా మాట్లాడుతున్నారు. మీరు పంపించిన పత్రికలు, క్యాలెండరు పంపించారు. చాలా సంతోషించాను.

**కె.మంగాయమ్మ, హైదరాబాదు.**

## గాయు ఆదర్శం

ప్రియులైన దైవజనులుకు స్పందన ఎడిటర్ గారికి నా వందనములు. స్పందన పత్రికలో ఉన్న ఆధ్యాత్మిక సంగతులను తెలుసుకుంటున్నాను. మార్చి పత్రిక అందినది. దయచేసి జనవరి, ఫిబ్రవరి పత్రికలు పంపగలరు. వాటిని కూడా చదవాలని ఎంతో ఆశపడుతున్నాను.

**జె.జయరాజు, గుంటూరు.**

## చదవాలని ఆశ

స్పందన వారికి వందనములు. స్పందన పత్రికలో అనేక దైవ సందేశములతోను, తెలియని అనేక విషయములు తెలియపరుస్తూ ఉన్నారు. చదవాలని ఆశతో ఉంటున్నాను. టి.వి కార్యక్రమం కూడా చూస్తున్నాను.

**యస్.యఫ్.సి పుష్పవల్లెమ్మ, కడప.**



- ఆచార్య ఆరార్కె

# ఇరుకుద్వార ప్రవేశం

ఇరుకు ద్వారాన ప్రవేశించండి. జీవానికి పోయే ద్వారం యిరుకు. ఆ దారి సంకుచితం. దాన్ని కనుగొనే వారు కొందరే. నాశనానికి పోయే ద్వారం వెడల్పు. ఆ దారి విశాలం. దాని ద్వారా ప్రవేశించేవారు అనేకులు. (మత్తయి 7:13-19) ఇరుకు ద్వారాన ఆషామాషిగా ప్రవేశించటం కుదరదు. క్రైస్తవ విశ్వాసుల క్రమశిక్షణకు గొప్ప బహుమానమున్నది. జీవమార్గం దేవుని రాజ్యంలోకి నడుపుతుంది. వెయ్యేండ్ల పరిపాలన. ఆత్మవంట నిత్యజీవం. కృపాబాహుళ్యం, నీతిదానం పొందేవారు జీవం గలవారు. ఈ జీవమే దేవుని రాజ్య సంకేతం. తూర్పు పడమర ఉత్తర దక్షిణాల నుండి యిరుకు ద్వారాన వచ్చినవారు ఈ రాజ్యంలో ప్రవేశిస్తారు. ఇది వెయ్యేండ్ల పరిపాలన.

**రక్షణ, బహుమానాలు**

ఈ రెండు వేరువేరు వాస్తవాలు. మార్కు 10:30 చూడండి. రాబోయే లోకంలో నిత్యజీవం పొందుతాము. అంటే రాబోయే యేలుబడిలో అని అర్థం. మత్తయి 5:22లో దేవుని రాజ్యంలో కొందరికి క్రమశిక్షణాత్మకమైన బాధ కలుగుతుంది. మహాసభ నరకాగ్ని అనే మాటలు జాగ్రత్తగా పరిశీలించండి. మత్తయి 18:8 లో ప్రభువు అన్నమాటలు కుంటివాడవుగానో, అంగహీనుడవుగానో జీవంలో ప్రవేశించటం మేలు అని చెప్పినప్పుడు వెయ్యేండ్ల పరిపాలనలో క్రమశిక్షనాత్మకమైన తేడా ఉన్నట్లు గ్రహించాలి. వెయ్యేండ్ల పరిపాలనలో ప్రవేశించాలంటే ఇరుకు ద్వారాన వెళ్ళాల్సిందే. కొండమీద ప్రసంగమంతా ఇరుకు ద్వారమే. ప్రభువు పిలుపు విని ఇరుకు ద్వారాన పరలోక రాజ్యంలోకి ప్రవేశించండి.ః

**అబద్ధ బోధకులు**

మత్తయి 7:15-23 వరకు అబద్ధ బోధకులను గురించిన హెచ్చరికలున్నాయి. ఇరుకు ద్వారాన్ని కృత్రిమ పద్ధతుల్లో పెద్దది చేసేవారే అబద్ధబోదకులు దేవుని వాక్యాన్ని మారుస్తారు. కల్లబొల్లి కబుర్లు చెబుతారు. గొర్రెచర్మాలు ధరించుకొని వస్తారు. వారిలో క్రీస్తు జీవం ఉండదు. గొర్రె చర్మాలు కప్పుకొని వచ్చి తోడేళ్ళ భాష మాట్లాడతారు. ఫలాన్ని బట్టి వారి స్వభావం తెలుసుకోవాలి. ముండ్ల చెట్టునుండి ద్రాక్షపండ్లు కొయ్యలేరు గదా! మంచి ఫలాలు ఫలించని చెట్లు, వంట చెరుకుగా మాత్రమే పనికొస్తాయి. కొండమీది ప్రసంగానికి భిన్నమైన బోధ అబద్ధ బోధ. ప్రభువా ప్రభువా అని పెదవులతో అంటే చాలదు. కొండమీద ప్రసంగంలో దేవుని చిత్తం బయలుపరచబడింది. ఆ ప్రకారం చేస్తేనే పరలోక ప్రవేశం! రాజ్య ప్రవేశం!

**వరాలు - ఫలాలు**

22వ వచనం ఆ రోజున అనేకులు నన్ను చూచి అంటారు. "ప్రభువా ప్రభువా మేము నీ నామమున ప్రవచించామే! దయ్యాలను వెళ్ళగొట్టాము. అనేకమైన



అద్భుతాలు చేశాము." ఈ వరాలన్నీ రక్షణకు సంబంధించినవి కావు. పరిశుద్ధాత్మ మనమీదికి వచ్చినపుడు ఆత్మవరాలు వస్తాయి గాని పరిశుద్ధాత్మ మనలో నివాసమున్నపుడు ఆత్మఫలాలు పండుతాయి. మనలో పరిశుద్ధాత్మ ద్వారా కలిగే ఫలితాలు రెండు. **ఆధ్యాత్మిక జీవం, సేవార్థమైన శక్తి.** వరాలు ఉన్నంత మాత్రాన పరిశుద్ధత వస్తుంది అనుకోవద్దు. కొరింథీ సంఘస్తులకు ఎన్నెన్నో వరాలున్నాయి గాని వారు శరీరానుసారులు. 1 కొరింథీ 1:5-7; 3:1-3 జాగ్రత్తగా పరిశీలించండి. వరాలు వచ్చిన వారికి చాలామందికి గర్వముండటం చూస్తున్నాము. శరీరానుసారమైన మనస్సు వీరిలో ప్రవేశిస్తుంది. ఆత్మవరాలను గురించిన సరైన అంచనా లేక చాలామంది పొరపాట్లు చేస్తున్నారు. వరాలు కావాలి. జీవం ఎక్కువగా కావాలి. మీరెవరో నేనెరుగను అంటున్నాడు ప్రభువు. వీరికి వరాలున్నాయి గాని దేవుని రాజ్యసంబంధమైన జీవం వీరిలో లేదు. వీరు అక్రమకారులు. నీ లోపల సిలువ కార్యం జరగకుండా నీకెన్ని వరాలున్నా నీవు దేవుని రాజ్యానికి దూరంగానే ఉంటావు. నీ వరాలన్నీ జీవములేని క్రియలవుతాయి. కొండమీది ప్రసంగం 5,6,7 అధ్యాయాలను 1 కొరింథీ 13 అధ్యాయంతో సరిపోల్చి చూడండి. సౌశీల్యం లేని నీ పని ఎందుకు? ప్రవచనాలు చెప్పినా, దయ్యాలను వెళ్ళగొట్టినా యిదంతా అక్రమం క్రిందికే వచ్చే ప్రమాదం లేకపోలేదు. లోపలి కృప బయటి వరం కంటే గొప్పది కదా! పనికంటే జీవం ముఖ్యం కదా! పరిశుద్ధాత్మ ఫలాలు వరాలకంటే ముఖ్యం. శక్తికంటే ప్రేమ గొప్పది. కొండమీద ప్రసంగాన్ని మన జీవిత విధానంగా రూపొందించుకుందాము.

## పక్షిరాజు

యిక్కడ ద్వారము మార్గము అన్నప్పుడు ఈ రెండు కొండమీది ప్రసంగ సత్యాలనే అన్వయిస్తాయి. ఇరుకు ద్వారం గనుక ఒక్కరొక్కరే ప్రవేశించాలి. పక్షిరాజు పైకి ఎగిరినప్పుడు ఒంటరిదై పోతుంది. పిచ్చుకలు ఎన్నెన్నో కలిసి ఎగురుతాయి గాని, ఎత్తు ఎగరలేవు. అ.కార్య 20:29లో పౌలు చెప్పినట్లు దొంగ బోధకులు తోడేళ్ళు, గొర్రె చర్మం కప్పుకుని మందలోకి జొరబడతారు. వీరు భక్తిగలవారే గాని తప్పుడు బోధలు చేస్తారు. అంచేత వీరి భక్తిలో జీవం లోపించి ప్రమాదకర చిహ్నాలు గోచరిస్తాయి. గొర్రెచర్మం మీద ఉంది. నైతిక ప్రవర్తన బాగానే ఉన్నట్లు కనబడుతోంది. అయితే అంతరంగంలో వీరు తోడేళ్ళు. ప్రజల్ని మభ్యపెట్టి శోధించేటప్పుడు సైతాను వెలుగు దూత వేషంలో వస్తాడు. 2 కొరింథీ 11:14 చెడ్డబోధకు మంచి నైతిక ప్రమాణాలు కలుపుతారు. ప్రభువు యిచ్చిన ఆజ్ఞలను మార్చి ప్రజలకు సులభతరం చేస్తారు కాబట్టే వీరిది దుర్బోధ.

## దేవుని చిత్తం

దేవుని చిత్తమెరుగని వారు ఎంత సేవచేసినా అది అక్రమమే. "నా వద్దనుండి పొండి" అంటే ఫలించని చెట్టులాగా వీరు అగ్నిలో వేయబడతారు. అవిధేయులు పరలోక రాజ్యంలో ప్రవేశించరు. విధేయతకు ప్రత్యామ్నాయం కాదు. అవిధేయులు విశాల మార్గస్తులు. వీరు అనేకులు, అసంఖ్యాకులు. 7:24-27 వరకు రెండు పునాదుల ఉపమానం. ఇదెంతో అర్ధవంతమైనది. ప్రతివిశ్వాసీ ఒక ఇల్లు కట్టుకుంటున్నాడు. కొందరు రాతి పునాది మీద కొందరు యిసుక పునాది మీద కడుతున్నారు.

## రెండు విభిన్నమైన పునాదులు

రాయి అంటే కొండమీది ప్రసంగం లోని సత్యం. దీని మీద నీ జీవితసౌధం నిర్మించుకోవాలి. ఈ రెండు రకాల పునాదులపై కట్టిన యిండ్లు చూట్టానికి ఒకలాగే ఉంటాయి. వాన కురిసి, వరదలు వచ్చి గాలి వీచినప్పుడు ఈ రెండు యిండ్లకు కఠిన పరీక్ష. 1 కొరింథీ 3 వ అధ్యాయంలో కూడా కట్టడానికి పరీక్ష ఉంది. అయితే యిది అగ్ని పరీక్ష. బండ దేవుని వాక్యం. ఈ పునాది మీద కట్టడం సత్క్రియలు. ఈ నా మాటలు విని ఆ ప్రకారం చేయనివాడు అంటే అతడి జీవిత సౌధం యిసుక పునాది. ప్రభువు మాట వినరు అంటే తమ స్వంత ఆలోచన చొప్పున జీవితాన్ని నిర్మించుకుంటారని అర్ధం. ఈ నిర్మాతలలో ఒకడు తెలివైనవాడు. మరొకడు బుద్ధిహీనుడు. మత్తయి 25 అధ్యాయంలోని కన్యకలను చూడండి. ప్రభువుకు శిష్యులై ఉండి కూడా రేపు కూలిపోయే యిల్లు కట్టుకునే వారుంటారని భావం. కొండమీది ప్రసంగంలోని సత్యాలకు అనుగుణంగా జీవించేవారు తెలివైనవారు.

యేసు ఈ మాటలు చెప్పి ముగించినప్పుడు జనసమూహాలు ఆయన బోధకు ఆశ్చర్యపడుతున్నారు. ఆయన శాస్త్రులవలె కాక అధికారంతో బోధించాడు. శిష్యులకు బోధించటం ప్రభువు మొదలుపెట్టాడు. అప్పుడు జన సమూహాలు కూడా అక్కడికి వచ్చేశారు. ఆయన బోధ అధికార పూర్వకమైనది. శాస్త్రులకు యింత అధికారం లేదు. ప్రభువుకు సర్వాధికారం ఉంది. దేవునికి స్తోత్రం.



- డా॥ దేవ దండల

# ఉజ్జీవం

**పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునపుడు మీరు శక్తి నొందెదరు. అ.కార్య 1:8**

క్రైస్తవులు పరిశుద్ధాత్ముని అవసరతను బలంగా గుర్తించినపుడే క్రైస్తవేతరులు తమ జీవితంలో క్రీస్తు యొక్క అవసరతను గుర్తిస్తారు. మారుమనస్సు పొందని వారు పరిశుద్ధాత్మ ద్వారా "కొత్తజన్మ" అనుభవంలోనికి రావాలంటే క్రైస్తవులు వారి పట్ల భారం కలిగి ప్రార్థనలో వారిని కనాలి. నిజమైన పాపపు ఒప్పుదల సిసలైన ఉజ్జీవంలో ఉన్నతమైన అనుభవం. ఆత్మ ఖడ్గం రెండంచులు కలది. ఉజ్జీవ ప్రక్రియలో ఇది రెండు విధాలుగా ఖండిస్తుంది. పశ్చాత్తాపాన్ని, ఉజ్జీవాన్ని సంఘంలోనికి తీసుకువచ్చి అదే సమయంలో సువార్త ద్వారా బలమైన మారుమనస్సును లోకంలో కలిగిస్తుంది.

## దేవుని క్షమాపణ

ఉజ్జీవం వచ్చినపుడు ఆ సమయంలో ఒకే విధమైన తలంపు సంఘమంతటినీ ఆవరిస్తుంది. సంఘంలోనూ, వ్యక్తిగత జీవితాలలోను ఉండే పాపాన్ని గూర్చిన ఆలోచన మొలకెత్తుతుంది. పాపాన్ని గూర్చిన ఒప్పుకోలు అవమానం బలమైన గాలివలె సంఘంపై వీస్తుంది. ఉజ్జీవం వచ్చినపుడు దేవుని వాక్యం లోపరహితమైందని దేవుని అధికారంతో కూడినది అనే గ్రహింపు వస్తుంది. అయితే మానవుడు సహజం గానే దేవుని దీవెనను పోగొట్టుకున్నాడని యేసు రక్తం తప్ప మరేది పాపపు డాగును కడగలేదని నిత్య శిక్షయైన నరకాన్ని తప్పించేది నూతన జన్మ అనుభవమేనని, దేవుని క్షమాపణ పొందుకుంటేనే పరలోకంలో స్థానం దొరుకుతుందని ప్రతి ఒక్కరూ గమనించాలి.

## కృపాక్షేమాలు

ఉజ్జీవం అంటే దావీదు (కీర్తన 23:4) చెప్పినట్లు గిన్నె నిండి పొర్లుట. దేవుడు పొంగి పొర్లేటంతగా కృపాక్షేమాలతో తన హృదయాన్ని నింపినట్లు ఇతడు అనుభవించాడు. ప్రభువు యొక్క ప్రేమ, కృప, క్షమాపణ, సన్నిధి తన జీవితం శక్తివంతం కాగా పరలోకమే తన హృదయంలోకి వచ్చేసిందా అన్నట్లు అతడు అనుభవించాడు. రెండవది మలాకీ 3:10లో చెప్పినట్లు పదియవ భాగం నా మందిరంలో ఉండునట్లు తీసుకురండని అప్పుడు ఆకాశవాకిండ్లను విప్పి



పట్టజాలనంత విస్తారంగా దీవెనలు కుమ్మరిస్తానని సైన్యములకధిపతియగు యెహోవా సెలవిచ్చిన రీతిగా దేవుని సొత్తయిన ప్రజలు ఆయన కృపాకటాక్షములను బట్టి కృతజ్ఞతా పూర్వకంగా కనీస పదియవ వంతు దేవునికి, ఆయన సేవ చేసే బిడ్డలకు భూమిమీద సమర్పించగలిగితే ఆకాశములు తెరువబడుట అనే ఈ అనుభవాన్ని పొంది పరిశుద్ధాత్మ ఉజ్జీవంతో ఆనందించగలుగుతారు.

### సువార్త వెలుగు

క్రైస్తవ సంఘంలో ఉజ్జీవం బలంగా వున్నప్పుడే సువార్త పరిచర్య బలం పుంజుకొని సువార్త లోకమంతటికీ అందుతుంది. క్రైస్తవులు తాము కలిగియున్న వెలుగు ననుసరించి జీవించినపుడే, పాపులు వారిలో నున్న వెలుగును గుర్తించి దాని ననుసరిస్తారు. ఉజ్జీవం కొరకు ప్రార్థించాలని యిష్టపడే వారు మొదటగా వారు సంపూర్ణ రక్షణకోసం ప్రార్థించాలి. ఉజ్జీవం వచ్చినపుడు అంతా ప్రతి వ్యక్తిలోనూ, సంఘములోనూ పాపాన్ని గూర్చి బలమైన ఒప్పింపు కలుగుతుంది. ఈ ఆధ్యాత్మిక ప్రకాశత యెదుట మేల్కొలపబడిన ఆత్మ యొక్క పాపం నల్లగా కనబడుతుంది. విస్తారమైన పాపములు వాటి భయంకరత్వంతో తేట తెల్లమవటమే కాకుండా ఒప్పింపబడి పాపులు వాటిని అద్దంలో చూచినట్లు చూడగలరు. దేవుడు వారిని చూచే రీతిలో తమ్మును తాము చూచుకుంటారు.

### ఉజ్జీవ ప్రసంగం

అపొస్తలుల కార్యములలో పేతురు ప్రసంగించినపుడు వేలాదిమంది పాపము, నీతి, తీర్పు విషయంలో ఒప్పింపబడినవారై పశ్చాత్తాపానికి, మారు మనస్సుకూ రక్షణలోనికి నడిపించబడ్డారు. అ.కార్య 2:14 మునుపెన్నడూ పేతురు ఇలా ప్రసంగించలేదు. వేలాదిమంది యూదులకు మెస్సియాను గురించి పరిశుద్ధాత్మ పూర్ణుడై, ఉజ్జీవంతో బహిరంగంగా ప్రకటించాడు. అలా బోధించి పేతురు నూతన నిబంధనలో మొదట ఉజ్జీవ ప్రసంగికునిగా గుర్తింపబడ్డాడు. దీనికి బలమైన కారణం యోహాను 21లో ప్రభువు భక్త పేతురును దర్శించిన విధానం ఎంతో శ్రేష్టమయినది. లోకమును ఎంతగానో ప్రేమించిన దేవుడు తప్పిపోయిన పేతురును, మిగతా శిష్యులను కూడా ప్రేమించి దర్శించాడు. ఓ ప్రత్యేకమైన ప్రశ్న పేతురును అడిగాడు. ఆ వాక్యభాగాన్ని యోహాను 21 అ. లో చదువుతుంటే గుండెలు పిండినట్టుంది. అవును ఎవరైనా ఈ ప్రశ్నకు హృదయాంతరంగంలోనుండి సమాధానమివ్వగలిగితే వారి జీవితాలు కూడా అద్భుతంగా మారిపోతా యనటంలో సందేహం లేదు. ఒక చిన్న అమ్మాయికి భయపడి ముమ్మారు యేసయ్యను ఎరుగనని బొంకిన పేతురు పెంతెకోస్తు దినాన నిలువబడి దేవుని వాక్యాన్ని ప్రకటించగా మూడు వేల మంది రక్షింపబడ్డారు. దీనికి కారణం ఆత్మనింపుదల బలమైన ప్రార్థన. రెండవది శక్తివంతమైన ఉపదేశం. ఈ రెంటి కలయిక ఉజ్జీవం.

ఆదిమ సంఘంలో దేవుని మహిమ కోసం ఎన్నో బలమైన అద్భుతమైన కార్యాలు ప్రభువు మహిమకోసం పేతురు ద్వారా దేవుడు జరిగించాడు. యేసయ్య చెప్పిన మాట ఒకటి, నాయందు విశ్వాసముంచువాడు నాకంటే గొప్ప కార్యాలు చేస్తాడు. అవును యేసయ్య నీడ పడి స్వస్థత పొందినట్టుగా చదవం గాని ఆయన యందు అచంచలమైన విశ్వాస ముంచిన ఆయన శిష్యుడు పేతురు సేవలో అలాంటి అద్భుతాలను దేవుడు చేశాడు.

### యేసయ్య ఆజ్ఞ

మారుమనస్సు పాప క్షమాపణలను గూర్చి ప్రకటించమని యేసు ఆజ్ఞాపించారు. (లూకా 24:47). పాప క్షమాపణ లేక పశ్చాత్తాపం ఈ రెండింటిలో ఒకటి మాత్రమే కాదు గాని రెండూ వుండితీరాలి. ఇదే మనకు అవసరమైన ఉజ్జీవం. ఈ విధమైన మెళుకువ రప్పించడానికి మన ప్రభువు ప్రకటన గ్రంథంలో తన బూరశబ్దాన్ని వినిపింపచేస్తున్నారు! గనుక ప్రియమైన సోదరుడా! సోదరీ! ఉజ్జీవాన్ని, ఆత్మ సంబంధమైన చైతన్యాన్ని ముందుగా నీ జీవితంలో కలిగియుండు ఆ తరువాత ఉజ్జీవం కొరకు ప్రార్థించే వారిలో నీవు ఒకడివిగా ఉండమని ప్రేమతో కోరుతున్నాను. దైవాశీస్సులు. ఆమేన్!



ఆర్.ఎలూజై

# అద్భుతమైన ఫలితాలు

**(ఆ మధ్యన (2010) డిసెంబరు మాసంలో దైవజనులు ఆరార్కే గారితో మాట్లాడుతున్నపుడు, వారిచ్చిన ఒక అంశానికి అక్షరరూపాన్నియడానికి చేసిన చిరు ప్రయత్నమే ఈ వ్యాసం. ఈ తలంపులు ఆధ్యాత్మికంగా మనలను బలోపేతం చేయాలని ఆశిస్తూ ప్రారంభిస్తున్నాను. ఇక చదవండి.)**

బంధుమిత్రులందరూ ఒక్క చోటికే చేరడంతో ఇల్లంతా కోలాహలంగా ఉంది. వారంతా సంపన్న శ్రేణికి చెందినవారు గనుక, ప్రతిరోజూ ఎవరో ఒకరి యింట కలుసుకోవడాలు వారికి సాధారణమే అయినా, ఆ రోజు మాత్రం అందరూ వాళ్ళ అన్నయ్య ఇంట్లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అది భోజనాల సమయం కావడం, వంటకాలన్నీ సిద్ధంగా ఉండడంతో అందరూ భోజనాలకుపక్రమించారు గానీ, వారి ఆత్మీయతా, అభిమానాల ముందు షడ్రసోపేతమైన ఆహార పదార్థాల రుచికూడా వెలవెలబోయినట్లయింది. అందరూ ఆనందంగా ఉంటే ఎవడికి కన్నుకుట్టిందో గానీ, ఉన్నట్టుండి పెద్ద శబ్దమొకటి వెలువడడం, ఏం జరిగిందో అర్థమయ్యేలోగానే, అరణ్యమార్గాన వచ్చిన సుడిగాలి ఇంటిలోనికి జొరబడి గది నాలుగు మూలల్నీ బలంగా తాకడంతో పునాదులు పూనకం వచ్చినట్లు ఊగిపోయి, ఇంటి పైకప్పు పెళపెళమంటూ కూలిపోవడంతో, ఇంట్లో ఉన్న ఏడుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెళ్ళు, అందరూ అక్కడికక్కడే ఆ రాళ్ళ క్రింద సజీవ సమాధి అయిపోయారు. ఈ సంఘటనలను ప్రత్యక్షంగా చూసి, వెంట్రుకవాసిలో చావు తప్పించుకుని వచ్చిన సేవకుడు చెపుతున్న మాటలు వింటుంటే భక్తుడైన యోబుకు తల తిరిగిపోయింది (యోబు 1:19)

## నిట్టూర్పు

అంతకు ముందే గొర్రెలన్నీ అగ్నిప్రమాదంలో కాలిబూడిదైపోయాయనీ, ఒంటెలను, ఎడ్లను, గాడిదలను శత్రువులు పట్టుకొని పోయారనీ, సేవకులు సమాచారం తెచ్చినా చలించని యోబు, తన పిల్లలందరూ అంత దారుణంగా చనిపోయారన్న దుర్వార్తకు మాత్రం అమితంగా తల్లడిల్లిపోయాడు. ఆలోచనల్లో అగ్నిపర్వతాలు బద్ధలైపోతుంటే, తన పైవస్త్రాన్ని చింపుకుని, "యెహోవా ఇచ్చెను, యెహోవా తీసుకుని పోయెను.' (యోబు 1:21) అంటూ భారంగా నిట్టూర్చాడే గానీ , ఈ విషయాలన్నింటిలోనూ నోటిమాటలతో కూడా అతడు పాపం చేయలేదని తెలియజేస్తుంది బైబిలుగ్రంథం.

## అన్యాయపు కన్నీళ్ళు

'గుండెల్లోనుంచి వచ్చే దుఃఖం గుడ్డివానికి కూడా కన్నీళ్ళు రప్పిస్తుంది' అంటాడు కవి. కానీ కన్నీళ్ళు కూడా కొన్నిసార్లు ఎంత అన్యాయంగా ప్రవర్తిస్తాయో అనిపిస్తుంది. కొంచెం ఓదార్పునైనా కలిగిస్తాయోమోననాశిస్తే కళ్ళలోనికి రాకముందే, గుండెల్లోనే ఆవిరైపోతాయి. గుండెను అగ్ని గుండంలోనే వదిలేస్తాయి. అలా యోబు ఎన్ని రాత్రులు నిద్రలేకుండా గడిపాడో, కన్నబిడ్డలు కళ్ళముందే కదలాడుతుంటే, ఎన్నిసార్లు భోజనం మీదనుంచి లేచిపోయాడో గాని, పగవానికి కూడా రాకూడదని చర్మరోగం త్వరలోనే అతనికి సంప్రాప్తించింది.



ఇక గోళ్ళతో గిక్కుంటే పుళ్ళు పడిపోతుంటే, వళ్ళు చల్లబడడానికన్నట్లు బూడిదలో కూర్చుని ప్రలాపించడం ప్రారంభించాడా భక్తుడు. పరామర్శించడానికొచ్చిన స్నేహితులకు అతని పరిస్థితి చూస్తుంటే, అప్రయత్నంగానే కళ్ళలో నీళ్ళు పొంగుకొచ్చాయి.

**ఆదరణ ఎవరివ్వగలరు?**

నిజంగా అలాంటి పరిస్థితుల్లో ఎవరు ఆదరణ కలిగించగలరంటారు? ఏదైన విపత్తు లేదా కష్టం కలిగిన వెంటనే మానవుడు 1) దిగ్భ్రాంతి చెందుతాడనీ (Shock) 2) కోపం చూపిస్తాడనీ (Anger) 3) ఇలా జరగలేదంటూ త్రోసిపుచ్చుతాడనీ (Denial) 4) అవి తిరిగి పొందుకొనేందుకు దేవునితోనూ, మానవులతోనూ బేరాలాడ ప్రయత్నిస్తాడనీ (Bargaining) 5) చివరిగా నిజాన్ని/ కలగబోయే ఫలితాలను అంగీకరిస్తాడనీ (Accptance) శాస్త్రీయ అధ్యయనాలు తెలియజేస్తాయి. ఆ పోగొట్టుకుంది వ్యక్తినైన కావచ్చు, వస్తువైనా కావచ్చు, ఆరోగ్యమైనా లేక మహాభాగ్యమైనా పోగొట్టుకున్నవారి మానసిక స్థితి మొదటి నాలుగు దశల్లో ఉన్నప్పుడు మాత్రం వారిని ఆదరించడం ఎవరికైనా దాదాపు అసాధ్యమేనని పరిశోధనలు తెలియజేస్తాయి.

**ఆదరణ అంటే?**

అయితే ఆదరణను ఎలా నిర్వచించగలం? హెబ్రీ భాషలో ne ha ma అని చెప్పబడిన ఈ పదం (యోబు 6:10) మానవుడు చూపగల గాఢ అనుభూతిని సూచిస్తుంది. అంటే బాధనొందిన వాని స్థితిని గ్రహిస్తూ, ఆ స్థితి అనుభవంలో నున్నట్లు భావిస్తూ, సమతుల్యమైన ఆలోచనలతో అనునయిస్తూ, బాధను పంచుకోవడానికి చేసే ప్రయత్నమే ఆదరణ అని అనవచ్చు. అలాంటి ఆదరణ మాత్రమే ఊరట నిస్తుంది. బాసటగా నిలుస్తుంది.

**యోబు స్నేహితులు**

యోబు స్నేహితులు అక్షరాలా అలానే ఆరంభించారు. "ఏడ్చువారితో ఏడ్వడమే" (రోమా 12:15) విశ్వాసికి విధి అని గ్రహించారేమో, "ఎలుగెత్తి ఏడ్చి ఒక వారం రోజులు అతనితో పాడు నేలపైనే కూర్చుని" (యోబు 2:12-13) అనునయించి ప్రయత్నించారు. అయినా ఎందుకోగానీ యోబుకు వారిమాటలు రుచించలేదు సరిగదా వళ్ళంతా కంపరమెత్తినట్లు "మీరు బాధకే కర్తలు గానీ ఆదరణకు కర్తలు కారు - Miserable comforters are you all (యోబు 16:2) అంటూ వాళ్ళను ఈసడించాడు. మంచి చెవుతుంటే మండిపడ్డాడు. అసలు వారు చేసిన తప్పేంటట? హితవే నేరమౌతుందా! స్నేహమే పాపమౌతుందా! ఏమౌతుందో ఏమోగాని, "ఆలోచనలేని ఆదరణ బాధను అధికం చేస్తుంది. వేదనను తీవ్రపరుస్తుంది" (consolation indiscreetly pressed upon,... only inctrases pain to render frief more poingnant) అంటూ ప్రముఖ తత్వకారుడు రూసో, ఆదరణలో ఆలోచన ప్రాముఖ్యత ఎంటో నిర్వచించాడు.

**ఆలోచనా రాహిత్యం**

అలా అనాలోచితమైన మాటల కారణంగానే యోబు స్నేహితులు అతడిని ఆదరించడంలో విఫలులయ్యారు. అమితమైన అభిమానం చూపినా, పోటీలు పడి మరీ పరుషవాక్యాలు పలికారు. యోబు కష్టానికి కారణం అతని పాపమే అన్నారు (అనుకున్నారు). ఇంటి వారిని కూడా అనునిత్యం పవిత్రపరచిన యోబు దినచర్యను ఇట్టే మరచిపోయారు (యోబు 1:5). వినాల్సిన చోట వాదాలు చేశారు. ఫీలింగ్స్ తెలుసుకోకుండా ఫిలాసఫీలు చెప్పారు. అసలు వారే గనుక మాట్లాడకపోతే, యోబు గ్రంథమే లేదన్నంత రీతిగా సాగిన వారి సుదీర్ఘమైన 'కౌన్సిలింగ్'లో వారు చూపిన 'తీర్పు తీర్చే దృక్పథం' (Judgemental Attitude) మిగిల్చింది, దేవుని కోపానికి వారిని గురిచేసింది. చివరకు యోబు వారికోసం ప్రార్థిస్తేగానీ, వారు క్షమించబడని స్థితి వచ్చేసింది (యోబు 42:7-9).

**ముగింపు**

ఈ వృత్తాంతంలోనుంచి మనమొక విషయం గ్రహించాలి. అనాలోచితమైన, అర్థరహితమైన 'కౌన్సిలింగు'లు ఆవేదననే మిగిల్చే సంఘటనలు కోకొల్లలుగా కనిపించే ఈ రోజుల్లో, ఆదరణ చూపగోరేవారు, పొందగోరేవారు అర్థవంతంగా ఆలోచించడం ప్రారంభించాలి. ఆరార్కే మాటల్లోనే చెప్పాలంటే, 'తప్పు చేయవద్దంటూనే తప్పుల్లో పడవేయడాలు, ఒప్పులు చెబుతూనే పప్పులో కాలేయడాలు సాధారణమైపోయిన ఈ రోజుల్లో మన దుఃఖము సంతోషంగా మార్చబడాలంటే ఆదరణ ఆలోచన సహితమైనదై యుండాలి. ఆలోచన నిర్మాణాత్మకమైనదై యుండాలి.

ఆదరణ ముసుగుల్లో, ఆలోచన లొసుగుల్లో అక్రమానికి నడిపించే ఎవరినైనా, ఎలాంటి విధానాలనయినా తప్పక తిప్పికొట్టాలి. అలా దైవానికి దూరం చేయడానికి ప్రయత్నించిన భార్య, స్నేహితుల మతిలేని మాటలను త్రోసిపుచ్చాడు గనుకనే రెట్టింపు ఆశీర్వాదాన్ని పొందాడా భక్తుడు యోబు. అట్టి పరిణతిని ఆశిస్తే, దేవుని ప్రార్థిస్తే, నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుమన్న ఆజ్ఞను పాటిస్తే, దైవమిచ్చు ఆదరణ (Heb. nihum) అద్భుతమైన ఫలితాలనిస్తుంది. జీవితాలను అమృతమయంగా మార్చేస్తుంది ★



రెవ. టి యస్ఆర్. ప్రసాద్‌రెడ్డి

# యేసు నేర్చుకొనెను

**"ఆయన కుమారుడైయుండియు తాను పొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను" హెబ్రీ 5:8**

పరిశుద్ధ దైవగ్రంథములో వైవిధ్యభరితంగా కనిపిస్తున్న లేఖనభాగములో ఇది ఒక ముఖ్యమైన వచనం. హెబ్రీ పత్రిక ప్రారంభము నుండి పరిశుద్ధాత్మ దేవుడు మన ప్రభువైన యేసుక్రీస్తు వారిని సర్వోత్కృష్ట స్థాయిలో అభివర్ణిస్తున్నాడు. ఈ విశ్వ ఆవిర్భావమునకు ముందు యేసుక్రీస్తు ప్రభువు ఏమై ఉన్నారో, ఈ జగత్తు నిర్మాణములో ఆయన ప్రాధాన్యతను, దేవదూత గణములో ఆయన అద్వితీయతను వర్ణిస్తూ, 3వ అధ్యాయమునుండి ప్రభువైన యేసుక్రీస్తు వారు జరిగించిన మహాయాజకత్వం పరిచర్యను, ఆయనలో నెరవేరిన సిలువ యజ్ఞపు పాతనిబంధన ప్రవచనములలో యేసుప్రభువు వారిని గూర్చి మనము నమ్మటానికి వీలుకానంత ఆశ్చర్యమైన ఒక మహా సత్యాన్ని ఇక్కడ మన కళ్ళ యెదుట ప్రత్యక్ష పరుస్తున్నాడు. "ఆయన కుమారుడైయుండియు... నేర్చుకొనెను." అంటున్నాడు. ఎంతో ఆశ్చర్యంగా ఉందికదూ!

ఏమిటీ విచిత్రం యేసుక్రీస్తు ప్రభువేమిటి నేర్చుకోవటమేమిటి? ఇది మన ఆలోచనకు అందనంత ఆశ్చర్యాన్ని కలిగించే సత్యం, మన ఇంగితం అంగీకరించలేని వాస్తవం. కాని పరిశుద్ధ గ్రంధములో పరిశుద్ధాత్మ దేవుడు ఈ సత్యాన్ని వ్రాస్తున్నాడు గనుక మనం ఈ విషయాన్ని అంగీకరించి, ధ్యానించవలసిందే.

ఇక్కడ ఒక విషయాన్ని మనం గమనిద్దాం "యేసుక్రీస్తు ప్రభువు నేర్చుకోవలసిన సంగతులు, తెలుసుకోవలసిన విషయములు ఈ విశ్వంలో ఏమైనా ఉన్నాయా? ఆయన సర్వజ్ఞుడు అనీ, ఆయన దృష్టికి మరుగైనదేదీ లేదని బైబిల్ గ్రంథంలో వ్రాయబడి ఉంది కదా! వాటిని తరచి చూస్తే..

యోబు 21:21 లో "ఎవడైనను దేవునికి జ్ఞానము నేర్పునా?" అని 1 సమూయేలు 2:3 ప్రకారం "దేవుడు అనంత జ్ఞానము కలవాడు" అని కీర్తన 147:5లో "దేవుని జ్ఞానమునకు మితిలేదు" అని దేవుని గూర్చి వివరించబడింది. 1 కొరింధీ 1:30,31 వచనములను చూస్తే "ఆయన మనకు జ్ఞానమై ఉన్నాడు" అని వ్రాయబడింది.

జ్ఞానమైన దేవుడు, అనంత జ్ఞానియైన దేవుడు, మితిలేని జ్ఞానం గల దేవుడు, సకల జీవరాశికి జ్ఞాన ప్రదాతయైన ఆ మహాసర్వజ్ఞుడు నేర్చుకోవడమేమిటి? సర్వజ్ఞుడైన దేవునికి, సకల విద్యలకు సృష్టికర్తయై దేవునికి తెలియని విద్య ఏదైనా ఉన్నదా? వైవిధ్య భరితంగా కనిపిస్తున్న ఈ లేఖనములను మనం శ్రద్ధతో ధ్యానిస్తే ఎన్నో ఆశీర్వాదకర సత్యాలు మనకు కనిపిస్తాయి.

యేసుక్రీస్తు ప్రభువు నేర్చుకున్నదేమిటి? **"ఆయన కుమారుడైయుండియు... విధేయతను నేర్చుకొనెను"** అంటున్నది లేఖనం.



ఏమిటీ మాట! జ్ఞాన ప్రదాత, జ్ఞాన స్వరూపియైన యేసుక్రీస్తు ప్రభువుకు విధేయత తెలియదా? ఆయన విధేయతను నేర్చుకొనెను అని అంటున్నాడంటే, ఆయనకు విధేయత తెలియదనే అర్థం వస్తుంది కదా!? ఈ సందర్భంలో మనం గమనించవలసిన సత్యం ఒకటి ఉంది.

**మహోన్నతుడు**

గడచిన నిత్యత్వంలో పరలోక రాజ దర్బారులో, దైవ స్వరూపియైన యేసుక్రీస్తు ప్రభువు ఎవరికి విధేయుడై ఉండాలి? ఎవరిముందు శిరస్సు వంచి నిలబడాలి? ఆయన సాక్షాత్తూ దేవుడై ఉన్నవాడూ, అదృశ్యదేవుని దృశ్యరూపి, సర్వసృష్టికి ఆదిసంభూతుడై ఉన్నవాడు, సకల జగత్తు ఉనికికి మూలకారకుడు.

వాస్తవానికి పరలోక రాజ దర్బారులో యేసుప్రభువు అసమానుడైన దైవకుమారుడు, పరలోక పరిశుద్ధ దూతల సభలో ఆయన మిక్కిలి భీకరుడు, భయంకరుడు అని (కీర్తన 87:6,7) చెప్పబడింది. ఫిలిప్పీ 2:6 "దేవునితో సమానంగా ఉన్నవాడు" అనీ, రోమా 9:5లో "యేసుక్రీస్తు సర్వాధికారియైన దేవుడు" అని తీతు 2:13లో "యేసుక్రీస్తు మహాదేవుడు'' అని ఆయన అద్వితీయుతను గూర్చి, దైవత్వమును గూర్చి వర్ణించబడింది.

మహా దేవుడును, సర్వాధిపతియు, దేవునితో సమానంగా ఉన్నవాడునైన యేసుక్రీస్తు ప్రభువు గడచిన నిత్యత్వంలో ఎవరికి విధేయుడై ఉండాలి? సమస్త విశ్వజీవరాశి అంతా ఆయనకు లోబడవలసిందే గానీ ఆయన ఎన్నడూ ఎవరికీ లోబడవలసిన ఆవశ్యకత లేదు. అందుచేత యేసుప్రభువు విధేయతగా ఉండవలసిన పరిస్థితులు గడచిన యుగాలలో ఎప్పుడూ సంభవించలేదు.

కానీ యేసుక్రీస్తు ప్రభువు మన పాపములకు విమోచనా క్రయధనాన్ని, సిలువ యజ్ఞం ద్వారా సమర్పించటానికి శరీరధారిగా ఈ భూమ్మీద జీవించిన దినములలో ఆయన విధేయత అనే విద్యను నేర్చుకున్నారు అనే సత్యాన్ని మనం గ్రహించాలి. నిజానికి విధేయత అనేది ఒక శ్రేష్ఠమైన విద్య అని చాలామంది క్రీస్తు భక్తులకే తెలియదు. ఈ విద్యను దైవసాన్నిధ్యంలో ప్రతిభక్తుడూ తప్పనిసరిగా నేర్చుకోవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది.

**మహోన్నత విద్య**

ఈ మహోన్నత విద్యను యేసుక్రీస్తు ప్రభువు ఏ విధంగా నేర్చుకున్నారు? హెబ్రీ 5:8 ''ఆయన ... తాను పొందిన శ్రమలవలన విధేయతను నేర్చుకొనెను" శ్రమల ద్వారా విదేయత. శ్రమలు అనేవి దైవ భక్తునికి పరలోక సౌభాగ్యాలను కుమ్మరించే ఆధ్యాత్మిక సిరులు. దైవసన్నిధి అనే పాఠశాలలో శ్రమలు అనే అనుభవాల గుండా దేవుడు మనలను నడిపించి ఎన్నో దివ్యసత్యాలను నేర్పిస్తూ ఉంటారు.

దావీదు భక్తుడు స్వానుభవంతో (కీర్తన119:71) "నేను నీ కట్టడలను నేర్చుకొనునట్లు శ్రమపొందియుండుట నాకు మేలాయెను" అంటున్నాడు. శ్రమల ద్వారా ఈ భక్తుడు దేవుని కట్టడలను, వాక్య సత్యములను నేర్చుకున్నాడు. 67వ వచనంలో చూస్తే "శ్రమల ద్వారానే ఈ భక్తిమార్గంలో సరిగా నడవ గలుగుచున్నాను" అని సాక్ష్యమిచ్చాడు దావీదు భక్తుడు.

సాక్ష్యాత్తూ యేసుప్రభువు వారు విదేయత అనే శ్రేష్టమైన విద్యను శ్రమల వలనేనే నేర్చుకున్నారు. విశ్వసార్వ భౌముడు, విశ్వచక్రవర్తి, అసమాన పరక్రమశాలియైన దైవకుమారుడు ఎంతగా విధేయత నేర్చుకున్నారో, ఎంతగా తగ్గించుకున్నారో ఆలోచిస్తుంటే భయమూ, ఆశ్చర్యమూ కలుగక తప్పదు.

**సిలువ శ్రమలు**

విశ్వన్యాయాధిపతియైన ఆ దైవ కుమారుణ్ణి అన్యాయంగా తీర్పు తీరుస్తున్న సమయంలో, మన పాపముల నిమిత్తం ఆయనను కొరడాలతో కొడుతున్నప్పుడు చర్మమంతా పొరలు పొరలుగా ముక్కలు ముక్కలుగా లాగివేస్తున్నప్పుడు, శరీరమంతా మాంసపు ముద్దగా మారిన సమయంలో, భరించలేని బాధలో కూడా ఆయన మౌనంలోని విధేయత, ప్రేమ అనిర్వచనీయం. తలపై ముండ్ల కిరీటాన్ని కాళ్ళుచేతులలో మేకులను కొదుతున్నప్పుడు తట్టుకోవటానికి వీలుకాని శ్రమలో బాధలో విధేయుడై తనను హింసిస్తున్న వారి కోసం క్షమించమని తండ్రికి ప్రార్థించటంలోని విధేయత హృదయాలను బద్ధలు చేస్తుంది. మనకు పాప విముక్తులను చేయటానికి ఆయన అన్యాయపు తీర్పుకు, అపనిందలకు, సిలువ శ్రమలకు విధేయుడయ్యాడు.

దైవకుమారుడైన క్రీస్తు ప్రభువు పరలోక తండ్రికి విధేయుడయ్యాడు, మానవులను నిత్యమోక్షానికి చేర్చటానికి తాను చేయ తలపెట్టిన సిలువ యజ్ఞపు శ్రమకు విధేయుడయ్యాడు. తనకు విధేయులైనవారందరికి నిత్యరక్షణ కర్త అయ్యాడు. (హెబ్రీ 5:10).

మనకోసం ప్రభువు భరించిన శ్రమలను, సిలువ శ్రమల ద్వారా ప్రభువు మనకు అనుగ్రహించిన దీవెనలను ప్రతిదినమూ ధ్యానిద్దాం. ప్రభువును సంతోష పెట్టగల విధేయతను నేర్చుకుందాం. నిత్య మోక్ష భాగ్యాన్ని పొందుదాం. దైవాశీస్సులు. ఆమేన్.



శ్రీమతి ప్రభ (అమెరికా)

# నన్ను రక్షించిన దేవుడు సజీవుడు

**"రక్షించుటకు సమర్థుడగు దేవుడు గాక మరి ఏ దేవుడును లేడు" దానియేలు 3:29**

**నా** పేరు ప్రభ. నేను పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు సమీపములో వున్న కొవ్వలి అనే గ్రామములో జన్మించాను. నా తల్లితండ్రులు ఆంజనేయులు, ఝాన్సీ. వీరికి నేను ప్రథమ సంతానము. నాకు తమ్ముడు వున్నాడు. పూర్వీకుల ఆచారము ప్రకారము విగ్రహారాధికులం. మా దేవుళ్లందరికీ మ్రొక్కేవారము. సత్యము తెలియదు. చిన్న తిరుపతి అనగా ద్వారకాతిరుమల సమీపములో వున్న తిమ్మాపురం అనే గ్రామములో అమ్మ జన్మించినది. అమ్మమ్మ గారింట్లో ఎక్కువగా విగ్రహారాధన జరుగుతూ వుండేది. ప్రతి సంవత్సరము భీష్మ ఏకాదశికి, ఏకాహము, సప్తాహము జరుగుతూ వుండేవి. పెద్ద పెద్ద పందిళ్ళు వేసి కుంకుమ పూజలు, భజనలు చేస్తూ వుండేవారు. ఏకాహము అంటే 24 గంటలు దీపము వెలుగుతూ వుండాలి. సప్తాహము అంటే 7 రోజులు దీపారాధన ఆరిపోకుండా వెలగాలి. ఊరివారంతా అమ్మమ్మ గారింటికి వచ్చి పూజలు చేస్తూ వుండేవారు. ప్రతి సంవత్సరము ఇదే విధంగా జరుగుతూ వుండేది. అటువంటి పరిస్థితుల్లో నేను పెరిగాను.

నిజమైన దేవుని నేను ఎరుగలేదు. కాని దేవుడు నన్ను ఎరిగి యున్నారు. (యిర్మియా 1:5). నా వివాహము వెంకట్రావు గారితో జరిగింది. నా ప్రెగ్నెన్సీ పరీక్షల కోసమని హాస్పటల్‌కు వెడితే నాకు గుండెలో రంధ్రముందని భయంకరమైన వార్త తెలిసింది. ప్రసవము జరిగేవరకూ తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ చెప్పి ప్రసవము జరిగిన తరువాత గుండె ఆపరేషన్ చేయించుకోవాలని చెప్పారు. చాలా వేదనకరమైన పరిస్థితి, ఆ రోజుల్లో కార్డియాలజి డవలప్ కాలేదు. గుండె జబ్బు అంటే చాలా భయపడేవారు. నన్ను మద్రాసు రాయవెల్లూరు తీసుకువెళ్ళి డాక్టరుకు చూపించారు. డెలివరీ అయిన తరువాత ఆపరేషన్ చేస్తాము అని చెప్పారు. ఏడవ మాసములో కాకినాడ హాస్పటల్‌లో జాయిన్ చేసారు. ఆపరేషన్ చేసి తియ్యాలని నొప్పులు రాకూడదు అని ముందుగానే డాక్టర్ చెప్పారు. నెలలు నిండకముందే 8వ నెల పూర్తయిన రెండవ రోజున నాకు ఆపరేషన్ చేసారు. చక్కటి ఆడపిల్లను దేవుడు యిచ్చారు. దేవునికి స్తోత్రము. అప్పుడు నాకు దేవుడు తెలియదు. కనుక నేను నిజదేవునికి స్తుతులు చెల్లించలేకపోయాను. నా కుమార్తెకు 2సం॥లు వచ్చినప్పుడు నాకు ఆపరేషన్ చేయించాలని మద్రాసు తీసుకొని వెళ్ళారు. నెలరోజులు హాస్పటల్‌లో వున్నాము. టెస్టులు అన్నీ చేసిన తరువాత ఆపరేషన్ చేయటానికి నిర్ణయించుకొన్నారు.

## క్రీస్తు గూర్చి పరిచయము

రేపు నాకు ఆపరేషన్ అనగా ఆ రాత్రి రోగుల కొరకు ప్రార్థించటానికి నా రక్షణ కొరకై దేవుడే పంపిన ప్రతినిధులుగా ఇద్దరు దైవజనులు వచ్చారు, విదేశీయులు లాగావున్నారు తెల్లగా చాలా పొడవుగా వున్నారు. వారు వచ్చి అందరికి ప్రార్థన చేస్తున్నారు. నా ప్రక్క బెడ్ ఆమె అన్నారు రేపు మీకు ఆపరేషన్ కదా మీరు వెళ్ళి ప్రార్థన చేయించుకోండి. దేవుడు సహాయం చేస్తారు అని చెప్పారు. నేను బెడ్‌పై కూర్చుని చూస్తున్నాను. కొంచెం సేపటికి నేను కూడా ప్రార్థన చేయించుకోవాలి అనే మనసు కలిగి, వెళ్ళి విషయం చెప్పి ప్రార్థన చేయించుకొన్నాను. వారు ఏమని ప్రార్థించారంటే ప్రభువా మీరు పరమ వైద్యుడు కదా పరమ ఆపరేషన్ చేసి ఈ బిడ్డను స్వస్థపరచండి అని ప్రార్థించారు. దేవుడు చేసిన అద్భుతం ఏమిటంటే నాకు అప్పుడు ఆపరేషన్ జరుగలేదు. ఇది ఎలా జరిగిందంటే.. ఆపరేషన్ రోజు రానే వచ్చింది. ఉదయం 8గం.లకు నన్ను సిద్ధపరచి ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్ళారు. మత్తు యిచ్చారు. నెమ్మదిగా నేను మత్తులోనికి వెళ్ళాను. డాక్టర్లు

హడావిడిగా తిరుగుతున్నారు. వారు నా ఆపరేషన్ ఆపి, చాలా ప్రమాద స్థితిలో వున్న (12 సం.లు) బాబుకు ఆపరేషన్ చేయుట జరిగింది. బాబును థియేటర్‌కు తీసుకువచ్చారు. నన్ను థియేటర్ ముందు రూములో వుంచారు. బాబు చిన్నవాడు కనుక తీసుకు వెళ్ళుతుంటే నన్ను చూచి చాలా ఏడ్చాడు. తరువాత నేను పూర్తిగా మత్తులోకి వెళ్లిపోయాను. తరువాత ఏమి జరిగింది. నాకు తెలియదు. బాబుకు ఆపరేషన్ చేస్తున్నపుడే చనిపోయాడని, మరల నేను ఆపరేషన్ చెయ్యలేనని డాక్టరు యింటికి వెళ్ళిపోయారని, మూడవరోజు చేస్తారని, మావారు నాకు మత్తువిడిన తరువాత చెప్పారు. ఆ రాత్రి 10గం.ల వరకు నాకు స్పృహరాలేదు. ఉదయమే నన్ను వార్డుకు తీసుకు వచ్చారట. గుండె ఆపరేషన్ అని బంధువులంతా వచ్చారు. వారంతా చాలా బాధపడ్డారు. మావారు 'నెల రోజులు ఉన్నాము గదా ఇంకా మూడవరోజు చేస్తామన్నారు కదా చేయించుకొని వెళ్దాము' అన్నారు. తరువాత వార్డులో ఒకావిడ అడిగారు "ప్రభా.." అని పిలచి "ఈ డాక్టరు దగ్గరకు మిమ్ములను ఎవరు పంపించారు" అన్నారు. "ఎందుకు అలా అడుగుతున్నారు" అని నేను అన్నాను. "నేను వచ్చిన తరువాత ఆ డాక్టరు చాలా ఆపరేషన్స్ చేశారని విన్నాను. కాని ఒక్కటీ కూడా సక్సెస్ కాలేదు. ఎందుకు ఆగిపోయిందో కాని వేరే డాక్టరుతో చేయించుకోమ్మా" అని చెప్పారు. మా వారితో నేను అన్నాను. "నన్ను యింటికి తీసుకు వెళ్ళండి. నేను యిప్పుడు ఆపరేషన్ చేయించుకోను'' అని చెప్పాను. చాలా బ్రతిమాలాడారు చేయించు కొమ్మని. డాక్టరు కూడా చెప్పారు. నీకు ఏమీ భయంలేదు. నేను చేస్తానన్నారు. నాకు యిప్పుడు చేయించుకోవాలని లేదు. మరలవస్తాము డాక్టరుగారు అని చెప్పి యింటికి వచ్చేశాం. అప్పటికి నాకు తెలియలేదు. ఇది దేవుడు చేసిన కార్యమని.

### క్రైస్తవ విశ్వాసుల సహవాసము

వేము ఇంటికి వచ్చిన కొన్ని రోజుల తరువాత కామవరపుకోట హైస్కూల్‌లో టీచర్స్‌గా చేస్తున్న రామారావు, సుహాసిని భార్యభర్తలు వచ్చి నన్ను చూచి అన్ని విషయములు తెలిసుకొన్న తరువాత యేసుప్రభువును గూర్చి చెప్పారు. వారు మాకు బంధువులు. వారు తెలుసుకొనిన విషయము చెప్పి ఆయనలో వున్న శక్తిని, వారు ఆయనను నమ్మిన తరువాత అనుభవించిన అద్బుతాలను నాకు వివరించారు. నీవు ఆయనను నమ్మితే దేవుడు తప్పక సహాయం చేస్తారు. నీలో వున్న భయమును తీసివేస్తారు అని చెప్పి ప్రార్థించి వెళ్ళారు. వారు చెప్పినపుడు నాకు ప్రార్థన చెయ్యాలనిపించింది. **అప్పటి నుండి ప్రార్థించటం మొదలు పెట్టాను. రోజురోజుకు నాలో మార్పు రాసాగింది. ఆరోగ్యం మెరుగుపడింది. నేను బలమును పొందుకొంటున్నాను.** నాకు ఎప్పటికైనా ఆపరేషన్ చెయ్యాలని డాక్టర్లు చెబుతున్నారు. నేను ప్రార్థనకు వెళ్ళుచున్నాను. దేవునిలో బలపడు చున్నాను. సిటీలో వుంటే వైద్యము, నా కుమార్తె చదువు బాగా కుదురుతుంది. నేను వెళ్ళి ఏదైనా చిన్న బిజినెస్ చేసి, మరల ఆపరేషన్ ప్రయత్నం చేయవచ్చు అనుకొని 1990 సం.లో హైదరాబాదు వెళ్ళడం జరిగింది. అనుకొన్న రీతిగానే దేవుడు ఆశీర్వదించి మమ్ములను బలపరిచాడు. 1992 నుండి సంఘము నకు వెళ్ళుచున్నాము. దేవుని కృపను బట్టి నా భర్త నేను బాప్తిస్మం తీసుకున్నాము. దేవుడు నాకు యిచ్చిన ఒక్క కుమార్తె శ్రీదేవిని దేవుడు ఆశీర్వదించారు. ఇంజనీరింగ్ చదవటానికి కృప చూపారు. వివాహం జరిగినది. అమెరికాలో వుంది. దేవుని తెలుసుకొన్న తరువాత ప్రార్థిస్తున్నపుడు పరిశుద్ధాత్ముడు తెలియచేశారు. ఆపరేషన్ అలా ఆగిపోవటము ఆయన చిత్తమని, ఆయన నన్ను ఏర్పరచుకొన్నారని. దేవునికి స్తోత్రము. 1982లో ఆగిపోయిన గుండె ఆపరేషన్ 1998 డిశెంబరు 28వ తేదీ కేర్ హాస్పటల్ చేయించుకోవటానికి దేవుడు కృపచూపారు. ఆపరేషన్ సక్సెస్ చేసి ఇంతవరకు నన్ను సజీవంగా వుంచిన నా దేవునికి నేను కృతజ్ఞతా స్తుతులు చెల్లిస్తున్నాను.

### అమెరికా దర్శించుట

అమెరికా రావడానికి రెండుసార్లు వీసా రాలేదు. మూడవ సారి నా కుమార్తెకు గర్భమును యిచ్చిన దేవుడవు నాయనా వీసా అనుగ్రహించి నేను అమెరికా వెళ్ళటానికి సహాయం చెయ్యండి అని సంఘముతో కలసి ఉపవాసముతో ప్రార్థించినపుడు దేవుడు వీసా అనుగ్రహించారు. 2009 మార్చిలో అమెరికా వెళ్ళాను. మరల ఫిబ్రవరి 2010లో వెళ్ళడానికి దేవుడు కృప చూపించారు. ఇపుడు నేను నా భర్త అమెరికా దేశములో వున్నాము. అల్పురాలనైన నన్ను దేవుడు ఘనపరచి ఆయన బిడ్డలుగా చేసుకొన్నందుకు దేవునికి స్తుతులు చెల్లిస్తున్నాను. సజీవుడైన దేవుని నామములో చదువుచున్న మీరంతా ఆశీర్వదించ బడుదురుగాక! ఆమెన్!

భార్య భర్తలకోసం...



పాస్టర్ పి.సురేష్‌బాబు

# ప్రేమ

చెంగు చెంగున ఎగురుతూ ఒకదాని వెనుక ఒకటి రెండు దుప్పులు వేగంగా పరుగెడుతున్నాయి. అడవిలోని వాగులన్ని ఎండిపోయాయి. చాలా దూరం ప్రయాణం చేసి ఇంకా వెతుకుతూ పరిగెడుతూనే ఉన్నాయి నీటికోసమని ఆ రెండు దుప్పులు. పరుగెడుతూ ఉండగా అదిగో అల్లంత దూరాన నీరు ఉన్నట్టు కనపడి దగ్గరకు వెళ్ళగానే మోసం చేసే ఎండమావులే కనబడుతున్నాయి. నిరాశపరుస్తున్నాయి. అడవి దాటి కొండలలో లయలలో కూడా వెతుకుతూ తిరుగుతున్నాయి. కాని చుక్క నీరు కూడా దొరికేటట్టుగా లేదు. అంతకు ముందే రెండు రోజుల క్రితం అడవిలో ఎండిపోతున్న ఒక వాగులో కొంచెం నీటికోసం అడవి జంతువులన్నీ పెద్ద యుద్ధమే చేశాయి. ఆ జంతువులన్నీ అక్కడ వేసిన చిందులుకు ఆ వాగులో ఉన్న కొంచెం నీరు కాస్తా బురదలాగా అయిపోయింది. చివరికి ఎవరికి తాగడానికి పనికిరాక మరుసటి రోజుకు మొత్తం ఎండిపోయాయి. ఇక జంతువులన్నీ కుటుంబాలు కుటుంబాలుగా నీటి వేటలో పడ్డాయి. ఈ దుప్పి జంట కూడా ఉదయం నుండి త్రాగాడానికి మధ్యాహ్నం వరకూ తిరుగుతూనే ఉన్నాయి గాని ఎక్కడా ఒక్క చుక్క నీరు కూడా దొరకలేదు. అయినా పట్టు వదలకుండా ఈ రోజు ఎలాగైనా కొంచెం నీరు త్రాగితే గాని మరల పనిచేయడానికి శరీరం సహకరించదని నీటి వేట కొనసాగిస్తూనే ఉన్నాయి.

మధ్యాహ్నం దాటింది. ఒక కొండమీదకు రెండు దుప్పులు చేరాయి. కొండ చివర భాగములో ఒక పెద్ద మడుగు ఎండిపోయి ఉంది. అయితే ఆ మడుగు చివర ఒక కొండరాయిలో కొంత నీరు కనపడింది. ఒక్కసారిగా రెండు దుప్పులు తమ కళ్ళు పెద్దవిగా చేసి ఒకరి ముఖము ఒకరు చూసుకొని ఆనందంతో చెంగున ఒక గెంతులో ఆ నీటి దగ్గరకు చేరాయి. దగ్గరకు వంగి ఆ నీటిని చూశాయి. అది లోతు లేదు. చాలా పైపైనే ఉన్నాయి నీళ్ళు. రెండు దుప్పులలో ఒక్క దుప్పికి మాత్రమే అవి సరిపోతాయి. రెండు దుప్పులు త్రాగాటానికి ఏ మాత్రం సరిపోవు.

రెండు దుప్పులు ఒకదాని ముఖం ఒకటి చూసుకుంటూ కొంచెం నిరాశతో కొంచెం సంతోషంతో నువ్వు త్రాగు అంటే నువ్వు త్రాగు అంటూ ఒకరికి ఒకరు త్యాగాన్ని కనుపరుస్తున్నాయి.

"నువ్వు బయట బాగా కష్టపడి వస్తావు. ఆహారాన్ని సంపాదించి



తీసుకొని వస్తావు. నువ్వే ఆ నీరు త్రాగు. నేనే మరో రోజు తాగుతానులే" అంది ఒక దుప్పి.

వెంటనే మరో దుప్పి "లేదు లేదు నేను బయట తిరుగుతాను కాబట్టి ఎక్కడో చోట నేను తాగుతాను నువ్వు తాగు నువ్వు పిల్లలకు పాలు ఇవ్వాలి కదా" అంది. ఇలా ఒకరికి ఒకరు నువ్వు తాగు అంటే నువ్వు తాగు అంటూ వంత పాడుతూ ఉన్నాయి.

కొద్ది సేపటికి ఇక రెండు దుప్పులు మనమిద్దరం ఇలా అనుకుంటూ ఉంటుంటే ఆ ఉన్న నీరు కాస్తా ఈ ఎండకు ఆవిరైపోతుంది అని సరే ఇద్దరం కలిసి తాగుదాం అని ఒక నిర్ణయానికి వచ్చాయి. రెండు దుప్పిలు ఆ నీటి గుంటకు అటూ ఇటూ ఎదురెదురుగా మోకాళ్ళు వంచి నీటిలో మూతి ముంచి త్రాగడం మొదలుపెట్టాయి. ఒక రెండు నిమిషాలు గడిచింది. విచిత్రమైన సంగతేమిటంటే ఆ నీరు తరగడం లేదు. కారణం ఏమిటో తెలుసా? నీటిలో తమ మూతులు ముంచిన రెండుదుప్పులు ఒకరి కోసం ఒకరు తాగకుండా ఎదురు చూస్తున్నాయి. సమయం గంటలు తరిగిపోతున్నాయి. కాని నీరు మాత్రం చుక్కకూడా తరిగిపోవడంలేదు. అయితే వారి మధ్య ఉన్న ప్రేమ మాత్రం మరింతగా పెరిగిపోతుంది.

చూశావా! ప్రియ యవ్వన బిడ్డా వారిరువురి మధ్య ఎంత ప్రేమ, ఆప్యాయత ఉన్నాయో. దేవుడు ప్రేమాస్వరూపి. ఆయన బిడ్డలమైన మనం ఒకరి మీద ఒకరం ప్రేమ చూపించాలి. ప్రేమకలిగియుండుటకు ప్రయాసపడాలి.

యేసు సంఘాన్ని ప్రేమించి దానికోరకు తన ప్రాణాన్ని పెట్టాడు. దేవుడు లోకమును ప్రేమించి తన ఒక్కాగానొక్క కుమారుణ్ని మనకు అనుగ్రహించాడు. దేవునికి స్తోత్రం ★

**భార్యాభర్తలు**
**ప్రేమించి లోబడాలి,**
**లోబడి ప్రేమించాలి.**

## ఏప్రిల్ గ.ను.క ఆల్ కరెక్టు వ్రాసినవారి పేర్లు

